వడ్డెర సంఘం రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్


బోదాస్ శ్రీనివాస్

సుభాష్‌నగర్: గాజుల రామారానికి చెందిన బోదాస్ శ్రీనివాస్‌కు అఖిల భారత జాతీయ వడ్డెర సంఘంలో సముచిత స్థానం లభించింది. రాష్ట్ర యువత వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, స్థానికంగా ఉన్న మురళి మేడ్చల్ జిల్లా యువత ప్రెసిడెంట్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమలాదేవి, రాష్ట్ర అధ్యక్షురాలు రమ, నియోజకవర్గ అధ్యక్షుడు సాతాల గోపాల్ పాల్గొన్నారు.

జైవాసవీ నూతన కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ సుచిత్రకు చెందిన జైవాసవీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాశెట్టి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా రుద్రంగి యోగేష్, కోశాధికారిగా కాసం నాగేశ్వర్, ఉపాధ్యక్షుడిగా పప్పిశెట్టి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా ఇన్‌చార్జి తోట భిక్షపతి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. జైవాసవీ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా అమావాస్య రోజున ఉచిత అన్నదానంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఉప్పల రమేష్, గుండ ఈశ్వర్‌రాజ్, పల్లా నాగరాజు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్.. జరభద్రం..!


మ్యాన్‌హోల్‌లో కర్రకు బట్ట కట్టి ఉంచిన దృశ్యం

జీడిమెట్ల: పైప్‌లైన్ రోడ్డు నుంచి సుభాష్‌నగర్ వెళ్లే రహదారిపై ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. నెల రోజులుగా దానిపై మూత లేకుండా ఉన్నది. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళ వాహనదారులు, పాదచారులు చూసుకోకుండా ప్రమాదాల బారిన పడుతారని గ్రహించిన స్థానికులు మ్యాన్‌హోల్ గుంతలో కర్రకు ఎర్ర బట్టను కట్టి ఉంచారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్



మేడ్చల్: మేడ్చల్ జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన నరేందర్ నియమితులయ్యారు. మేడ్చల్‌కు చెందిన యూనివర్సిల్ 369 అసోసియేషన్ నరేందర్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నరేందర్ మేడ్చల్ మున్సిపల్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. సీఎం కప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

అంబేడ్కర్ బాటలో నడవాలి



కీసర: అంబేడ్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాల్సిన అవసరం ఉందని యువన్యాయవాది, కీసరగుట్ట ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు దుర్గం సాయినాథ్‌గౌడ్ అన్నారు. వారం వారం అంబేడ్కర్‌కు జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం కీసర అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన 153వ జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నేతలు కుమార్, వేణుగోపాల్, శ్యామ్‌కుమార్, సంతోష్, కట్ట శంకరయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్డు పనులకు గ్రహణం!

- పేట్‌బషీరాబాద్–రామ్‌రెడ్డినగర్ వరకు విస్తరణ ప్రతిపాదనలు
- హెచ్‌ఆర్డీసీఎల్ ఆధ్వర్యంలో రూ.35 కోట్ల నిధుల మంజూరు
- కాలనీల సంక్షేమ సంఘాల అభ్యంతరాలతో ముందుకు సాగని వైనం


ప్రతిపాదనలో ఉన్న రోడ్డు


కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ షేట్‌బషీరాబాద్–సుభాష్‌నగర్ డివిజన్ రామ్‌రెడ్డినగర్ లింకు రోడ్డు విస్తరణ పనులు ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు రూ. 39 కోట్ల వ్యయంతో జీడిమెట్ల సురక్ష ఆసుపత్రి వరకు సుమారు 1.2 కిలోమీటర్ల మేర 100 ఫీట్ల రోడ్డు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే పనులు ప్రారంభించే దశలో పలు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు రోడ్డు వెడల్పు విషయమై అభ్యంతరం తెలుపుతుండడంతో ఆదిలోనే పనులకు గ్రహణం పట్టినట్లయ్యింది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రతిపాదన ఉన్నప్పటికీ తాజాగా పనులు ప్రారంభించే సమయంలో అడ్డంకులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ కాలనీవాసుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని పనులు ప్రారంభించాల్సిన సంబంధిత అధికారులు తమ పరిధి కాదన్నట్లు వ్యవహరించడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఇళ్లకు మార్కింగ్ చేసిన దృశ్యం

లింక్ రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు చెక్..

ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన జీడిమెట్ల పారిశ్రామికవాడకు హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిధులు మంజూరయ్యాయి. లింకు రోడ్డు ఏర్పాటుతో సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు, కుత్బుల్లాపూర్ గ్రామం రోడ్డులో ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం కలిగించినట్లు అవుతుంది. అంతేగాకుండా భారీ వాహనాలు జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లాలంటే ఈ రోడ్డే అనువైన ప్రాంతంగా ఉంటుంది. జాతీయ రహదారి 44 సురక్ష ఆసుపత్రి నుంచి రామ్‌రెడ్డినగర్ వరకు రోడ్డు పనులు జరగనున్నాయి. పనులు త్వరగా పూర్తిచేయాలని హెచ్‌ఆర్డీసీఎల్ ప్రయత్నం చేస్తుండగా.. మరోవైపు రోడ్డు విస్తరణను కొంతవరకు కుదించాలని పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరడం గమనార్హం.


లింక్ రోడ్డు విస్తరణ సర్వే చేస్తున్న దృశ్యం

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కరే స్ఫూర్తి

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- ఇందిరమ్మ కాలనీ ఫేజ్–1లో విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: 'నీకోసం జీవిస్తే నీలోనే నిలిచిపోతావు..అదే జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావన్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాటలే తనకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఇందిరమ్మ కాలనీ ఫేజ్–1లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ దూరదృష్టితో రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్–3తో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగామన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని, సమసమాజ స్థాపనకు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్ గాజుల సుజాత, నాయకులు చంద్రగిరి సతీశ్, సాంబశివారెడ్డి, భిక్షపతి, ముత్యాలు, జలగం చంద్రయ్య, అంబేడ్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు కుంటపల్లి రమేశ్, అధ్యక్షుడు దాసరి మల్లేశ్, ఉపాధ్యక్షుడు మూరకొండ మధు, ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దాదిమాల సూరి, దేవరాయ యాదగిరి, దేవరాయ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


బోరు పనులు ప్రారంభిస్తున్న హేమలతరెడ్డి

సుభాష్‌నగర్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలతరెడ్డి అన్నారు. సూరారంకాలనీ పార్కులో రూ.11 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా బోరు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ సహకారంతో పార్కులో వాకింగ్ ట్రాక్, బోరు, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా వస్తువులను సమకూర్చుతున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, నాయకులు పందిరి యాదగిరి, మహిళా అధ్యక్షురాలు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

కుత్బుల్లాపూర్: గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాములుపై మతోన్మాదుల దాడి చేయడం అమానుషమని కుత్బుల్లాపూర్ సీఐటీయూ కమిటీ నాయకులు మండిపడ్డారు. దాడిని ఖండిస్తూ ఆదివారం నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి దేవదాసం పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీ పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం కంబలపల్లి రాములు డ్యూటీలో ఉన్నప్పుడు అయ్యప్ప మాలలో ఉన్న విద్యార్థికి సారు కాలు తగిలించాడని హెచ్ఎంపై మతోన్మాదులు భౌతిక దాడి చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల సీఐటీయూ అధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్, కే శీను ఈ, కరుణాకర్, బీ, నర్సింహులు, కే, బీరయ్య, గోపాల్, మధు, షఫీ, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో సంక్రాంతి సంబురాలు


డ్రాయింగ్ విజేతకు బహుమతి అందజేస్తున్న మేయర్ నీలారెడ్డి


ప్రగతినగర్‌లో వేడుకల్లో నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా ప్రగతినగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సురేంద్ర కుమార్ యాదవ్, సుబ్బు, చంద్రశేఖర్, శివకుమార్, చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ తరగతులను వినియోగించుకోవాలి


తరగతులను పరిశీలిస్తున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ స్టేట్ కో.ఆర్డినేటర్ పద్మశ్రీ

సుభాష్‌నగర్: ఓపెన్ స్కూల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ స్టేట్ కో.ఆర్డినేటర్ పద్మశ్రీ సూచించారు. ధూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను మేడ్చల్ జిల్లా కో.ఆర్డినేటర్ సత్యనారాయణతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు మధ్యలో ఆపేసిన వారు దూరవిద్య ద్వారా టెన్త్, ఇంటర్ పూర్తి చేయవచ్చన్నారు. ఈ నెల 30 వరకు గడువు ఉందని ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధూలపల్లి పాఠశాల ప్రిన్సిపాల్, కో.ఆర్డినేటర్ అయిన బ్రహ్మచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకలపై పోలీసుల నిఘా


పబ్ నిర్వాహకులతో మాట్లాడుతున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు

కుత్బుల్లాపూర్: న్యూఇయర్ వేడుకల సందర్భంగా డిసెంబర్ 31వ తేదీ రాత్రి జరిగే ఈవెంట్లపై పేట్‌బషీరాబాద్ పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే స్టేషన్ పరిధిలోని పబ్స్, బార్ అండ్ రెస్టారెంట్లలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ డ్రగ్స్ వినియోగం ఇతర మత్తు పదార్థాల విషయమై ఆరా తీస్తున్నారు. గుండ్లపోచంపల్లి పరిధిలోని మలాబు పబ్బును పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్, ఎస్ఓటీ బృందం ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. డీజే సౌండ్ తక్కువగా ఏర్పాటు చేయాలని ఇతరులకు ఇబ్బందికరంగా మారితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలువురికి అనుమతులు మంజూరు చేశామని, ఈవెంట్లలో ఏమైనా గొడవలు జరిగితే సంబంధిత నిర్వాహకులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

అపూర్వ విద్యార్థుల సమ్మేళనం


షాపూర్‌నగర్ జడ్పీ స్కూల్ 2004-05 విద్యార్థులు

రంగారెడ్డినగర్: షాపూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్ 2004–05 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించి, వారితో సహపంక్తి భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, పాఠశాల చైర్మన్ ముద్దాపురం మదన్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, సునీత, కరుణాకర్, పద్మావతి, త్రిమూర్తి, అరుణ, సుబ్బలక్ష్మి, రెహమాన్, విజయలక్ష్మి, సుభాష్, దేవదూత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: బాల్యంలో తమతో చదువుకున్న మిత్రుడు మరణించడంతో ఎదులాబాద్ జెడ్పీ పాఠశాల 1995–96 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అతడి కుటుంబానికి అండగా నిలిచారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కామరాజు హన్మంత్ మృతి చెందాడు. దీంతో పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి రూ. 35 వేలు అందజేశారు.

నూతన సంవత్సర కేలండర్ల ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం, జగద్గిరిగుట్టకు చెందిన శ్రీ పోలుతూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ, మాణిక్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ల నూతన సంవత్సర కేలండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీగాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కృష్ణమోహన్, సీనియర్ రిపోర్టర్ సర్వేపల్లి రమేశ్ కుమార్, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ చైర్మన్ కంచాల హనుమంతుచారి, మాణిక్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

దుండిగల్: సొంత ఖర్చులతో దివ్యాంగులకు ఆర్టీసీ బస్ పాసులు అందించడం ఆనందంగా ఉందని బీజేపీ నేత పీసరి కృష్ణారెడ్డి అన్నారు. కౌన్సిలర్ పీసరి బాలమణి కోరిక మేరకు భౌరంపేటలో 50 మందికి పైగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్ పాసులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా డిసెంబర్ 25న దరఖాస్తు చేయించి అందించామన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరి రిమాండ్

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎండీ ఫిరోజ్ (42) నగరానికి వలస వచ్చి ధూలపల్లిలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసముంటున్నాడు. స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగా సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి సరఫరా వృత్తిని ఎంచుకున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన గంజాయిని ప్యాకెట్లుగా చేసి పలువురికి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ధూలపల్లిలోని స్టీల్ సిటీలో ఈ నెల 28న రాత్రి ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకుని 1.95 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: భవనంపై నుండి దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబుబాబాద్ జిల్లా కోత్తపోచారం గ్రామానికి చెందిన పఠాన్ బియాబాని (54) ధూలపల్లిలోని శ్వేతశుభం అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ డిప్రెషన్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 6.45 గంటల సమయంలో భవనం ఐదో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన పఠాన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'యూఫోరియా–2024' వేడుకలు


ఎమ్మెల్యే వివేకానంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఫాదర్స్ మోడల్ హైస్కూల్ యాజమాన్యం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ భూమిరెడ్డి కాలనీలోని ఫాదర్స్ మోడల్ హైస్కూల్‌లో ఆదివారం 'యుఫోరియా–2024' వార్షిక వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వివేకానంద్ హాజరయ్యారు. పాఠశాల వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్ట్ దివంగత మంతెన లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత బిజీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ ఉద్యోగాలు, పనులకే పరిమితం కాకుండా పిల్లలతో కాస్త సమయం కేటాయించి వారి బాగోగులపై శ్రద్ధ పెట్టి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు బల్వంత్ రెడ్డి, పెద్ది మల్లేశం, మురళీగౌడ్, క్యూఆర్ఎస్ఎంఏ ఉపాధ్యక్షుడు చింతల మల్లేశం యాదవ్, నారాయణ, ఫాదర్స్ మోడల్ హైస్కూల్ సహా వ్యవస్థాపకురాలు పద్మ మంతెన, కరస్పాండెంట్ రవళిక పతకోటి, డాక్టర్ రవి కిరణ్ మంతెన పాల్గొన్నారు.


వార్షికోత్సవ వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న ఫాదర్స్ మోడల్ హైస్కూల్ విద్యార్థులు

మర్యాదపూర్వక కలయిక


ఐఎన్‌టీయూసీ నేత చింతల నాగరాజుతో కార్మికులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతానికి చెందిన పలువురు కార్మికులు ఐఎన్‌టీయూసీ నేత చింతల నాగరాజును చింతల్‌లోని తయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నాగరాజు మాట్లాడుతూ.. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని, కొన్ని పరిశ్రమల్లో కనీసం ఫైర్ సేఫ్టీ పరికరాలు కూడా అమర్చడం లేదన్నారు. అంతేగాకుండాకార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడంలో సైతం యాజమాన్యాలు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల భద్రతపై యాజమాన్యాలు దృష్టి సారించాలని, లేకుంటే కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో వివిధ పరిశ్రమల కార్మికులు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఉన్నారు.

సర్వదోష నివారణ మహాయజ్ఞంలో హరియాణా గవర్నర్

మేడ్చల్ రూరల్: టెంకాయ విశిష్టతను తెలిపేందుకే సర్వదోష నివారణ మహాయజ్ఞంలో టెంకాయలు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాయిగీత ఆశ్రమ వ్యవస్థాపకుడు సద్గురు సాయికుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమంలో యేటా డిసెంబర్ చివరి ఆదివారం సర్వ దోష నివారణ మహా యజ్ఞం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా సద్గురు మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం, విశ్వశాంతి, పంచభూత శాంతి కోసం ఈ సర్వదోష నివారణ మహా యజ్ఞాన్ని 60 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ యజ్ఞంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు.